సాక్షి నంద్యాల

బుధవారం ౹ 1 ౹ జనవరి ౹ 2025



నీలకంఠుడికి నృత్య నీరాజనం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళావేదిక పై మంగళవారం కాకినాడ శాస్త్రీయ నృత్య కళాకారుల సంక్షేమ సమాఖ్య వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.



క్యాలెండర్ ఆవిష్కరణ

కర్నూలు(సెంట్రల్): లోకాయుక్త నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఉప లోకాయుక్త జస్టిస్ పి.రజని మంగళవారం ఆవిష్కరించి ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



శనగల బసవన్నకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలక్షేత్రంలో శనగల బసవన్న, బయలువీరభద్ర స్వామికి మంగళవారం ఆలయాధికారులు పంచామృతాలతో అభిషేకాది అర్చనలు నిర్వహించారు.

నయా జోష్

- అంబరాన్నంటిన న్యూ ఇయర్ వేడుకలు
- 2025కు ఘన స్వాగతం పలికిన జిల్లా ప్రజలు
- అర్ధరాత్రి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు చెప్పుకున్న ప్రజలు





నూతన సంవత్సర సంబరాల్లో కర్నూలు నగర యువత కేరింతలు

కర్నూలు కల్చరల్: నూతన సంవత్సరం ప్రారంభమయ్యే క్షణాన ఆనందం మెరుపులా మెరిసింది. ఉత్సాహం ఆకాశాన్ని తాకింది. ఆశలు.. ఆశయాలను నిజం చేస్తూ తమను విజయ పథాన నిలుపుతుందనే ఆకాంక్షలతో జిల్లా ప్రజలు నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. సంబరాలు మిన్నంటే వేళ నింగి నేల కాంతుల హేల.. మది నిండా మధుర స్మృతులతో 2024కు వీడ్కోలు.. కోటి ఆశలతో కొత్త సంవత్సరానికి స్వాగతాలు.. ఉప్పొంగిన ఉత్సాహంతో హ్యాపీ న్యూ ఇయర్ అంటూ.. అన్నీ మంచి శకునాలే అనుకుంటున్న జిల్లా ప్రజలు మంగళవారం అర్ధరాత్రి తర్వాత కొత్త ఏడాదిలోకి అడుగు పెట్టారు. బాణాసంచా కాలుస్తూ కేకులు కట్ చేస్తూ మిఠాయిలు పంచుకున్నారు. నయా సాల్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. కర్నూలు, నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు, డోన్, నందికొట్కూరు, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, పత్తికొండ తదితర పట్టణాల్లో యువత సంతోషంగా గడిపారు. ఉత్సాహంతో 2025 సంవత్సరానికి స్వాగతం పలుకుతూ వేడుకలు జరుపుకున్నారు.

కాలంలో కలిసిపోయిన మరో సంవత్సరం

కాలగర్భంలో మరో ఏడాది 2024 కలిసిపోయింది. నూతన సంవత్సరం 2025లోకి కొంగొత్త ఆశలతో అడుగుపెట్టాం. గతం మనకు కొంత మంచిని కొంత చెడును మిగిల్చి ఉండొచ్చు. పాత కొత్త కలయికలను నెమరు వేసుకుంటూ జీవితాన్ని ఆశావహ దృక్పథంతో నిర్మించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరికి ఉంది. గడిచిన సంవత్సరంలో ఎంతో మందికి ఎన్నో మధుర జ్ఞాపకాలు ఉంటాయి. మరి కొందరికి చేదు అనుభవాలు కూడా ఉంటాయి. చేదు అనుభవాలను గురువుగా భావించి మధుర జ్ఞాపకాలను పాఠ్యాంశాలుగా అనుకుంటే కొత్త జీవితం ప్రగతి మార్గంలో పయనిస్తుంది. ఈ నూతన సంవత్సరంలో కొత్త ఆశలతో ప్రతి మనిషి ముందుకు సాగిపోవాలని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరుకోవడం సహజం. అయితే ఆశకు తగిన కృషి కూడా ఉండాలి. ముఖ్యంగా యువత పరుగులెత్తే వయసులో విజ్ఞానం పేరుతో కొత్తదనం పేరుతో చెడు మార్గంలో పయనిస్తే తమ కుటుంబంతో పాటు సమాజానికి, దేశానికి అపారమైన నష్టం కలుగుతుందనే విషయాన్ని గ్రహించాలి.

మార్కెట్‌లో జోరుగా విక్రయాలు..

2024 వీడ్కోలు, 2025కు స్వాగతం వేళ మార్కెట్‌లో క్రయ విక్రయాలు జోరుగా సాగాయి. గ్రామాలు మొదలు కొని నంద్యాల పట్టణ వరకు ఎక్కడ చూసినా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టాల్స్ దర్శనమిచ్చాయి. మాంసాహారం దుకాణాలు, రెస్టారెంట్లు, హోటళ్లు, నర్సరీలు, ఫ్లవర్ దుకాణాలు, స్వీట్స్ షాప్స్, కూల్ డ్రింక్స్, బేకరీల్లో కేక్‌లతో ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేశారు. న్యూ ఇయర్ స్పెషల్ ప్యాక్‌లు, ఆకర్షణీయ ఆఫర్లను వ్యాపారులు ప్రకటించారు. సుమారు రూ.80 కోట్ల వరకు క్రయ, విక్రయాలు జరిగి ఉంటాయని వ్యాపార వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

న్యూస్‌రీల్

వ్యవసాయ ఉద్యోగుల నూతన కార్యవర్గం ఎన్నిక



సంఘం నూతన కార్యవర్గం

కర్నూలు(అగ్రికల్చర్): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘానికి అనుబంధంగా ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యవసాయ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం మంగళవారం ఏకగ్రీవంగా ఏర్పాటైంది. ఏపీజీఈఏ జిల్లా శాఖ అధ్యక్షుడు బంగి శ్రీధర్, రాష్ట్ర వ్యవసాయ ఉద్యోగుల సంఘం నేతలు రఘురామ నాయుడు, డీ.శ్రీహరి ముఖ్య అతిథులుగా హాజరై ఎన్నిక కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సంఘంలో ఆఫీసు సబార్డినేట్ నుంచి పరిపాలన అధికారి వరకు అన్ని కేటగిరి ఉద్యోగులు ఉంటారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా ఎం.శ్రీహరి(నంద్యాల జిల్లా), కార్యదర్శిగా హెచ్.రూపేష్‌కుమార్ (కర్నూలు జిల్లా), సహా అధ్యక్షుడిగా ప్రవీణ్‌కుమార్, కోశాధికారిగా సాయికుమార్, ఉపాధ్యక్షులుగా సునీల్‌కుమార్, ఎండీ ఆలీ, దివాకర్, సంయుక్త కార్యదర్శులుగా జయరాజు, పి.కిశోర్, శివకుమార్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా రాజేష్, అలేఖ్య, జిల్లా ఈసీ మెంబర్లుగా జయరాములు, సాంబశివుడు, రాష్ట్ర ఈసీ మెంబరుగా విజయకుమార్ ఎన్నికయ్యారు. తర్వాత వీరు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి 2025 టేబుల్ క్యాలెండర్ విడుదల చేశారు.

డీసీసీబీ సీఈవోగా వెంకటేశ్వరస్వామి

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్రబ్యాంకు ముఖ్య కార్యనిర్వహణ అధికారిగా ఎం.వెంకటేశ్వరస్వామి ఎంపికయ్యారు. ఈయన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో జనరల్ మేనేజర్‌గా పని చేసి ఏడాది క్రితం పదవీ విరమణ చేశారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్నారు. కర్నూలు డీసీసీబీతో పాటు వివిధ డీసీసీబీల సీఈవో పోస్టులు ఖాళీగా ఉండటంతో కొన్ని నెలల క్రితం ఆప్కాబ్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో భాగంగా వెంకటేశ్వరస్వామి సీఈవో పోస్టుకు దరఖాస్తు చేసుకున్నారు. ఇటీవల నిర్వహించిన ఇంటర్వ్యూల్లో ఈయన ఎంపికయ్యారు. కొందరు పేర్లను డీసీసీబీ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ చైర్‌పర్సన్ అయిన జేసీ నవ్యకు పంపారు. మంగళవారం కలెక్టరేట్‌లో జేసీతో ఆప్కాబ్ ప్రతినిధి కొండలరావు, ఎఫ్‌ఏసీతో సీఈవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న విజయకుమార్ సమావేశమై సీఈవో ఎంపికపై చర్చించారు. ఇందులో ఎం.వెంకటేశ్వరస్వామిని సీఈవోగా ఎంపిక చేస్తూ జేసీ ఉత్తర్వులు జారీ చేశారు. దాదాపు ఏడాది నుంచి ఖాళీగా ఉన్న ఈ పోస్టుకు ఎట్టకేలకు రెగ్యులర్ సీఈవోను ఎంపిక చేశారు.

4న లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు

కర్నూలు(అర్బన్): ఈ నెల 4వ తేది ఉదయం 11 గంటలకు నంద్యాల కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో లూయిస్ బ్రెయిలీ 217వ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఉమ్మడి జిల్లా సహాయ సంచాలకులు రయిస్ ఫాతిమా మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జయంతి రోజున ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, బ్యాంకు ఉద్యోగులైన అంధులకు ఓడీ సౌకర్యం కల్పించామన్నారు. ఈ నేపథ్యంలోనే అంధ ఉద్యోగులు తమ అధికారులకు తెలియజేసి ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆమె కోరారు.

విద్యార్థులు ప్రణాళికతో చదవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ జనార్దన్‌రెడ్డి

పాణ్యం: విద్యార్థులు ఒక ప్రణాళికతో చదవాలని నంద్యాల డీఈఓ జనార్దన్‌రెడ్డి సూచించారు. మంగళవారం సుగాలిమెట్ట వద్ద ఉన్న కస్తూరిబాగాంధీ బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలు దగ్గర పడుతున్న సమయంలో ఎలాంటి ఒత్తిడికి గురి కాకుండా ప్రశాంత వాతావరణంలో చదువుకోవాలన్నారు. అలాగే సమయానికి పోషకాహారం తీసుకుంటూ ఆరోగ్యంగా ఉండాలన్నారు. ముఖ్యంగా పరీక్షలు అంటే భయం వీడాలన్నారు. అనంతరం విద్యార్థులకు అందుతున్న ఆహారం,చదువుపై ఆరా తీశారు. వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.

ఇస్తెమాకు పకడ్బందీ ఏర్పాట్లు



అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఫరూక్

- 2 లక్షలకు పైగా ముస్లింలు హాజరయ్యే అవకాశం
- ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి
- అధికారులతో మంత్రి ఫరూక్

ఆత్మకూరు: పట్టణంలో జనవరి 7 నుంచి 9వ తేదీ వరకు జరిగే ఇస్తెమా కార్యక్రమం విజయవంతానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ రాజకుమారితో కలిసి ఆత్మకూరులో ఇస్తెమా ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో ఏర్పాట్లపై సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో తొలిసారిగా ఆత్మకూరు పట్టణంలో ఇస్తెమా ఏర్పాటు చేశామని, దీనికి దాదాపు 2 లక్షలకు పైగా ముస్లింలు హాజరయ్యే అవకాశం ఉందని తెలిపారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ప్రధానంగా పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, వైద్య సేవలపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమం నిర్వహణకు ప్రభుత్వం రూ.2 కోట్లు మంజూరు చేసిందని చెప్పారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ఆత్మకూరు పట్టణంలో తొలిసారిగా నిర్వహిస్తున్న ఇస్తెమాలో ఎలాంటి పొరపాట్లు జరగకూడదని ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, పోలీసు శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. అంతకుముందు ఆమె వైద్యశాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు ఎలాంటి ప్రణాళిక లేకుండా ఉండటం సరికాదన్నారు. ఇస్తెమా కమిటీ సభ్యులు అనుమతిస్తే అన్నదానం ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నట్లు స్థానిక ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అన్నారు. సమావేశంలో వివిధశాఖల అధికారులు, సిబ్బంది, ఇస్తెమా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగమే లక్ష్యంగా బరిలోకి..

- కానిస్టేబుల్ ఎంపిక పరీక్షలకు రెండో రోజు 266 మంది హాజరు
- తుది రాత పరీక్షకు 197 మంది ఎంపిక



పరుగు పందెంలో పోటీ పడుతున్న పోలీసు అభ్యర్థులు



కాలికి తగిలించిన సెన్సార్ చిప్‌ను కంప్యూటర్‌కు అనుసంధానం చేస్తున్న సాంకేతిక సిబ్బంది

కర్నూలు: తలపై టోపీ... చేతిలో లాఠీ... ఒంటిపై ఖాకీ డ్రస్సుతో పోలీసుగా తమను తాము చూసుకోవాలనేది చాలామంది కల. దీనిని సాకారం చేసుకోవడమే లక్ష్యంగా పలువురు అభ్యర్థులు పోలీసు కానిస్టేబుల్ ఎంపిక పరీక్షల్లో బరిలో దిగి ప్రతిభ కనబరిచారు. ఆంధ్రప్రదేశ్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్వహించిన ప్రాథమిక పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన కానిస్టేబుల్ అభ్యర్థులకు కర్నూలు ఏపీఎస్పీ రెండో పటాలంలో శారీరక సామర్థ్య, దేహదారుఢ్య పరీక్షలు కొనసాగుతున్నాయి. రెండోరోజు మంగళవారం ఉమ్మడి జిల్లాకు చెందిన 600 మంది పురుష అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 266 మంది హాజరయ్యారు. వారికి ఎత్తు, ఛాతీ విస్తీర్ణం తదితర పరీక్షలు నిర్వహించి అనంతరం అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించి మైదానంలోకి అనుమతించి పరుగు, లాంగ్‌జంప్ పోటీలు జరిపారు. కొంతమంది సంబంధిత ధ్రువపత్రాలు లేకపోవడంతో వెనుదిరిగి వెళ్లారు. మరికొంత మంది కొలతలు సరిపోక అనర్హులయ్యారు. ముందుగా 1600 మీటర్ల పరుగు పందెంలో నిర్ణీత సమయానికి చేరుకున్న వారికి 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ పోటీలు నిర్వహించారు. వీటిలో ఉత్తీర్ణత సాధించిన వారికి అర్హత పత్రాలు అందజేశారు. తుది రాత పరీక్షకు 197 మంది ఎంపికయ్యారు. మధ్యాహ్నం 2 గంటలకు దేహదారుఢ్య పరీక్షల ప్రక్రియ పూర్తి కాగా ఫలితాల పత్రాలను అందించడం ఆలస్యమైంది.

వివరాలు కంప్యూటర్‌లో నిక్షిప్తం...

పోలీసు అభ్యర్థుల శారీరక సామర్థ్య, దేహదారుఢ్య, పరుగు పందెంలకు సంబంధించిన మొత్తం సమాచారాన్ని ఎప్పటికప్పుడు సాంకేతిక పరిజ్ఞానంతో కంప్యూటర్‌లో నమోదు చేసి భద్రపరుస్తున్నారు. బయోమెట్రిక్ పూర్తి చేసిన తర్వాత ప్రతి అభ్యర్థి కాలికి చిప్‌తో కూడిన రిస్ట్ బ్యాండ్ తగిలించుకుని పోటీల్లో పాల్గొన్నారు. రెండేళ్ల క్రితం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రాథమిక ఎంపిక రాత పరీక్షలు పూర్తి చేయగా తాజాగా అధికారులు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఫిబ్రవరి 1వ తేదీ వరకు సెలవు దినాలు మినహా ఈ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగనుంది. కేటాయించిన తేదీల్లో గైర్హాజరైనవారికి చివరిలో మరో అవకాశం ఇవ్వనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు.

వరిధాన్యం కొనుగోలుకు చర్యలు

- కర్నూలు మార్కెట్‌లో వరి ధాన్యం క్రయ విక్రయాలకు చర్యలు
- ఈ మేరకు మిల్లర్లతో సమావేశం
- త్వరలో కొనుగోళ్లపై నిర్ణయం
- మార్కెట్ కమిటీ సెక్రటరీ జయలక్ష్మి



మిల్లర్ల సమావేశంలో మాట్లాడుతున్న సెక్రటరీ జయలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో వరి ధాన్యం క్రయవిక్రయాలు నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని మార్కెట్ కమిటీ సెక్రటరీ జయలక్ష్మి తెలిపారు. మంగళవారం మార్కెట్ యార్డులోని సెక్రటరీ చాంబరులో మిల్లర్లతో సమావేశమై మార్కెట్ యార్డులో ధాన్యం క్రయవిక్రయాలు నిర్వహించడంపై చర్చించారు. ధాన్యం కొనుగోలుకు ఉన్న అవకాశాలను, సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. ధాన్యం కొనుగోలుకు మిల్లర్లు సానుకూలంగా స్పందించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో వరి ధాన్యం ప్రధాన ఆహార పంట, అయితే మార్కెటింగ్ సదుపాయం లేదు. రైతులు దళారీలకు విక్రయించుకుంటూ నష్టపోతున్నారు. ఈ నేపథ్యంతో మార్కెట్‌లో ఈ–నామ్ ద్వారా రహస్య టెండరు విధానంలో వరి పంట కొనుగోలుకు చర్యలు చేపట్టినట్లు సెక్రటరీ జయలక్ష్మి తెలిపారు. మిల్లర్లతో మరింత లోతుగా చర్చించి త్వరలోనే తగిన నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, శివన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలి

నంద్యాల: జనన, మరణ ధ్రువీకరణ పత్రాల ఆవశ్యకతను తెలియజేస్తూ వాటిని పొందే విధానంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి వైద్యాధికారులు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. మంగళవారం ఆమె తన చాంబర్‌లో జనన మరణ పత్రాల జారీపై అధికారులతో ఇంటర్ డిపార్టుమెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన తర్వాత 21 రోజుల వ్యవధిలోపు డెలివరీ అయిన ఆసుపత్రిలోనే మెడికల్ ఆఫీసర్ నుంచి డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్ పొందవచ్చునన్నారు. ఈ విషయం ప్రజలకు తెలిసేలా ప్రధాన కూడళ్లు, ప్రభుత్వ కార్యాలయాల్లో డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. జనన, మరణ రికార్డులు సంబంధిత కార్యాలయాల్లో ఉండడంతో పాటు సచివాలయాల్లో కూడా అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైతే మరణిస్తారో ఆయా ప్రదేశం నుంచే మరణ ధ్రువీకరణ పత్రం పొందాల్సి ఉంటుందని తెలిపారు. మరణాల నమోదు రిజిస్టర్ కూడా శ్మశానవాటికల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. నంద్యాల ఆర్‌డీఓ విశ్వనాథ్, డీఎంహెచ్‌ఓ వెంకటరమణ, డీసీహెచ్‌ఎస్ జఫరుల్లా, ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ జిలానీ, మునిసిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి, స్టాటిస్టికల్ అధికారి సుజాత పాల్గొన్నారు.

7వ తేదీ వరకు అభ్యంతరాల స్వీకరణ

నంద్యాల(అర్బన్): ఎస్సీ కుల గణనపై అభ్యంతరాల (ఆడిట్) స్వీకరణ గడువును ఈనెల 7వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు జిల్లా ఎస్సీ సంక్షేమం సాధికారత అధికారిణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇది వరకు డిసెంబర్ 31వ తేదీ వరకు గడువు ఉండేదన్నారు. దీనిని మరో వారం రోజులు పొడిగిస్తూ ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.

తూతూ మంత్రంగా..

- ఉదయం గంటన్నర పాటే ఇంటిదగ్గర పింఛన్ల పంపిణీ
- తర్వాత సచివాలయాలు, రచ్చబండల దగ్గర అందజేత
- వికలాంగులు, వయోవృద్ధులకు తప్పని కష్టాలు

కర్నూలు(అగ్రికల్చర్)/ నంద్యాల (అర్బన్): ఇంటి దగ్గరే పింఛన్ల పంపిణీ మాటలకే పరిమితమైంది. జనవరి నెలకు సంబంధించిన పంపిణీ కూడా సచివాలయాలు, రచ్చబండల దగ్గరే జరిగింది. 1వ తేదీ నూతన సంవత్సర వేడుకలు జరుగుతుండటంతో ఒకరోజు ముందుగానే అంటే ఈనెల 31వ తేదీన పింఛన్లు పంపిణీ చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. మంగళవారం ఉదయం కొద్దిసేపు వార్డు, గ్రామ సచివాలయ ఉద్యోగులు ఇంటి దగ్గర పంపిణీ జరగగా ఆ తర్వాత యథాప్రకారం సచివాలయాలు, రచ్చబండల దగ్గరకు మారింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పింఛన్ల పంపిణీ జరగడం ఏడో సారి .అయితే ఇప్పటి వరకు ఒకసారి కూడా పూర్తిస్థాయిలో ఇంటి దగ్గర పింఛన్ల పంపిణీ విజయవంతంగా జరగలేదు. దీంతో వేలాది మంది వికలాంగులు, వయోవృద్ధులు, కిడ్నీ బాధితులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో వలంటీర్లు ఐదేళ్ల లబ్ధిదారులకు ఇంటి దగ్గరే పింఛన్ సొమ్ము అందజేశారు. దీంతో అవ్వాతాతలు, వికలాంగులు, వ్యాధి గ్రస్తులు ఎవరూ ఇబ్బంది పడలేదు. తెలుగుదేశం, జనసేన పార్టీల కుట్రల వల్ల ఈ ఏడాది ఏప్రిల్ నుంచి పింఛన్‌దారులకు కష్టాలు మొదలయ్యాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత వలంటీర్లను తొలగించారు. సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇంటి దగ్గరే పింఛన్లు పంపిణీ చేస్తామని ప్రకటించారు. అయితే, అమలు మాత్రం తూతూ మంత్రంగా సాగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కర్నూలులో 95.95,నంద్యాలలో 95.78 శాతం పంపిణీ...

జనవరి నెలకు సంబంధించి ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కర్నూలు జిల్లా 8వ స్థానంలో నిలిచింది. జిల్లాలో 2,39,818 పింఛన్‌దారులుండగా.. సాయంత్రం 6 గంటల సమయానికి 2,30,108 (95.95 శాతం)మందికి పింఛన్ అందజేశారు. నంద్యాల జిల్లాలో 2,16,111 పింఛన్లు ఉండగా...2,06,983 పంపిణీ చేశారు. 95.78 శాతం పంపిణీ జరిగింది. మిగిలి న లబ్ధిదారులకు గురువారం పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మైనార్టీ, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. నంద్యాల మండలం పులిమద్ది గ్రామంలో మంగళవారం ఆయన పింఛన్లు పంపిణీ చేసి మాట్లాడారు.

చెంచుగూడేల్లో నన్నారి తోటల సాగు



నన్నారి నర్సరీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి

ఆత్మకూరు: నల్లమల అటవీ డివిజన్ పరిధిలోని అన్ని చెంచుగూడేల్లో నన్నారి తోటల సాగును విస్తృతం చేస్తున్నట్లు ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి పేర్కొన్నారు. బైర్లూటీ చెంచుగూడెంలోని నన్నారి నర్సరీ కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించి మాట్లాడారు. ఇక్కడి కేంద్రంలో శిక్షణ పొందిన వారి ద్వారా ఇతర చెంచుగూడేల్లో నన్నారి తోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తామన్నారు. ఈ తోటల పెంపకం ద్వారా ప్రతియేటా గిరిజనులకు మంచి ఆదాయం వస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో అన్ని గూడేల్లో నన్నారి నర్సరీ కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి నాయక్, ఆర్వోఎఫ్ఆర్ ప్రాజెక్టు అసిస్టెంట్ రాఘవేంద్ర, వెలుగు సీసీ యూసూఫ్, అంకన్న, బైర్లూటీ సర్పంచ్ గురమ్మ తదితరులు పాల్గొన్నారు.

కలియుగ దానకర్ణుడు బుడ్డా వెంగళరెడ్డి



బుడ్డా వెంగళరెడ్డి చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: కనీవిని ఎరుగని డొక్కల కరువు సమయంలో ప్రజల ఆకలి తీర్చిన ఉయ్యాలవాడ బుడ్డా వెంగళరెడ్డి దానకర్ణుడిగా కీర్తింపబడుతున్నారని వక్తలు కొనియాడారు. మంగళవారం పట్టణంలో ప్రకృతి పీఠం ఆధ్వర్యంలో వెంగళరెడ్డి వర్ధంతిని నిర్వహించారు. ముందుగా బుడ్డా వెంగళరెడ్డి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రిటైర్డ్ లైబ్రేరియన్ పల్లె నరసింహారెడ్డి, రిటైర్డ్ హెచ్‌ఎం నారాయణస్వామి మాట్లాడుతూ 1860లో రాయలసీమలో సంభవించిన డొక్కల కరువు బీభత్సాన్ని గమనించిన బుడ్డా వెంగళరెడ్డి గంజి కేంద్రాలను ప్రారంభించి తన వద్ద ఉన్న ధాన్యంతో మూడేళ్లపాటు అన్నదానం చేశారన్నారు. బుడ్డా వెంగళరెడ్డి దానగుణం తెలుసుకున్న ఇంగ్లాడ్ రాణి విక్టోరియా మహారాణి ఢిల్లీ పిలిపించి రాజప్రతినిధుల సభలో ఆయనకు బంగారు పతకాన్ని, ప్రశంసా పత్రాన్ని ఇచ్చి ఘనంగా సన్మానించారన్నారు. ప్రథమ స్వాతంత్య్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, దానకర్ణుడు బుడ్డా వెంగళరెడ్డి రేనాటి సూర్యచంద్రులుగా కొనియాడబడుతున్నారన్నారు. కార్యక్రమంలో ప్రకృతి పీఠం సభ్యులు పల్లె చంద్రశేఖర్ రెడ్డి, ఏరాశి మహేశ్వరరెడ్డి, శివశంకర్‌రెడ్డి, శివన్న పాల్గొన్నారు.

పెద్దాసుపత్రిలో వృద్ధునికి అరుదైన శస్త్రచికిత్స

కర్నూలు(హాస్పిటల్): మూత్ర సమస్యతో బాధపడుతూ యూరిన్ బ్యాగ్ చేతబట్టుకుని తిరుగుతూ నిత్యం నరకం అనుభవించే వృద్ధునికి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల యురాలజీ విభాగం వైద్యులు ఆ బాధ నుంచి విముక్తి కలిగించారు. మంగళవారం యురాలజీ హెచ్‌ఓడీ, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సీతారామయ్య వివరాలను వెల్లడించారు. ఆదోనికి చెందిన సుదర్శనరావు(74) ఆర్ అండ్ బీ కార్యాలయంలో ఉద్యోగం చేసి పదవీ విరమణ చెందారు. ప్రస్తుతం ఆయన అనంతపురంలో కూతురి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆయనకు మూత్రాశయంలో సమస్య ఏర్పడింది.



డాక్టర్ సీతారామయ్యను సన్మానిస్తున్న సుదర్శన్‌రావు, వైద్యుల బృందం

వైద్యులు అతనికి యూరినరీ బ్యాగ్‌ను అమర్చాల్సి వచ్చింది. ఎక్కడికి వెళ్లినా బ్యాగ్‌ను వెంట బెట్టుకుని వెళ్లాల్సి వచ్చేది. ఈనెల 21న కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని యురాలజీ విభాగంలో చేరారు. అన్ని రకాల ఆరోగ్య పరీక్షలు చేయించిన వైద్యులు ప్రోస్టేట్‌లో సమస్య ఉన్నట్లు గుర్తించి డిసెంబర్ 27న డాక్టర్ సీతారామయ్య ఆధ్వర్యంలో వైద్యుల బృందం శస్త్రచికిత్స నిర్వహించారు. ఆయన కోలుకోవడంతో మంగళవారం డిశ్చార్జ్ చేశారు. కృతజ్ఞతగా డాక్టర్ సీతారామయ్యను సుదర్శన్‌రావు సన్మానించారు. ఆపరేషన్ చేసిన వారిలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ముత్యశ్రీ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బాల రవితేజ, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ మహేష్‌నాయక్, పీజీలు లయీఖ్ ఫాతిమా, హిమజ, ప్రశాంత్, ఉమామహేశ్వర్, రవీంద్రనాథ్, సాయిసుదీప్ ఉన్నారు.

రోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తే చర్యలు



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ పి.సింధు సుబ్రహ్మణ్యం. చిత్రంలో సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు, వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని గైనిక్ విభాగంలో చికిత్స కోసం వచ్చే రోగుల నుంచి ఏఎన్‌ఎం, సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బంది డబ్బు వసూలు చేసినట్లు ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మంగళవారం ఆయన హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ పి.సింధు సుబ్రహ్మణ్యంతో కలిసి ఆసుపత్రిలోని పలు విభాగాలను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఏపీఎంఎస్ఐడీసీ ద్వారా రూ.3 కోట్ల గ్రాంట్ మంజూరైందని, ఇందులో హాస్పిటల్‌కు సంబంధించిన సివిల్ వర్క్స్, డ్రైనేజీ మరమ్మతులు, ఎలక్ట్రికల్ వర్క్ ద్వారా ఆసుపత్రిని అభివృద్ధి చేయనున్నట్లు ఆయన తెలిపారు. గైనిక్ విభాగంలో బాత్‌రూమ్‌ల మరమ్మతులు, ఫార్మసీ విభాగంలో బాత్‌రూమ్‌ల కోసం అంచనా ఇవ్వాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి ఆవరణలో ఉన్న డ్రైనేజీ మరమ్మతులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఆసుపత్రిలో అన్ని విభాగాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలని శానిటేషన్ సిబ్బందికి ఆదేశించారు. ఆయన వెంట ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సీతారామయ్య, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ హేమనళిని, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాలనాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్, న్యూ డయాగ్నోస్టిక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సునీల్ ప్రశాంత్, ఆసుపత్రి ఏడీ రమేష్‌బాబు, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్–2 విమలమ్మ ఉన్నారు.

విద్యుదాఘాతంతో రెండు ఆవుల మృతి



బనగానపల్లె రూరల్: మండలంలోని యనకండ్ల గ్రామంలో విద్యుదాఘాతంతో రెండు గోవులు మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు వివరాలు.. గ్రామంలోని శ్రీకృష్ణ మందిరానికి చెందిన గోవులు గ్రామసమీపంలోని పెట్రోల్ బంకు వద్ద మేత మేస్తుండగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు తగిలి షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందాయి. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఎలాంటి రక్షణ గోడ లేకపోవడంతోనే గోవులు మృతి చెందాయని శ్రీ కృష్ణమందిరం నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లాకిన్స్‌లా నుంచి 614 క్యూసెక్కుల నీటి విడుదల



కేసీ కెనాల్‌లో ప్రవహిస్తున్న నీరు

పాములపాడు: కేసీ కెనాల్ 120వ కిలో మీటరు లాకిన్స్‌లా నుంచి 614 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సుంకేసుల నుంచి కేసీ కాల్వలోకి 800 క్యూసెక్కుల నీరు వస్తోందన్నారు. కాగా మండలంలోని శాంతినిలయం గ్రామ సమీపంలోని లాకిన్స్‌లా నుంచి తూడిచెర్ల సబ్‌చానల్‌కు 570 క్యూసెక్కులు, అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు 34 క్యూసెక్కులు, నిప్పులవాగుకు 10 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నామని వివరించారు.

ఘనంగా ఖాదర్‌లింగ స్వామి జన్మదిన వేడుకలు



దర్గాలో ఫాతెహాలు చేస్తున్న దృశ్యం

కౌతాళం: మండల కేంద్రంలో వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. తెల్లవారు జామున 5 గంటలకు ప్రత్యేక ఫాతెహాలు అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు. సాయంత్రం దర్గాలో ప్రత్యేక ఫాతెహాల అనంతరం స్వామి చిత్రపటానికి పూలమాల వేసి గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. వేడుకల్లో జిల్లా నలుమూల నుంచే గాక మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించుకున్నారు. కాగా ఆచారం ప్రకారం స్వామి చిత్రపటాన్ని గ్రామానికి చెందిన లింగాయితీ వంశస్తులు తలపై మోసుకొని ఊరేగింపు నిర్వహించడం హిందూ, ముస్లిల ఐక్యతను చాటి చెప్పింది.

కూటమి ప్రభుత్వంపై ఉద్యమాలు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



భారీ ర్యాలీలో పాల్గొన్న రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, జిల్లా నాయకులు, కార్యకర్తలు

కర్నూలు(అర్బన్): ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేంత వరకు కూటమి ప్రభుత్వంపై పోరాటాలు చేస్తూనే ఉంటామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. సీపీఐ శత జయంతి ఉత్సవాల సందర్భంగా మంగళవారం కర్నూలులోని జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ మీదుగా సీపీఐ కార్యాలయం సీఆర్ భవన్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో రామకృష్ణ మాట్లాడుతూ అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పిన చంద్రబాబు.. ఇప్పుడు మాట మార్చి విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలను మోసం చేశారన్నారు. సొంత ఇల్లు లేని పేదవారికి పల్లెల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల స్థలం ఇస్తామని చెప్పిన హామీపై ఇంత వరకు అతీగతీ లేదన్నారు. మహిళలకు ఉచిత బస్సు రవాణా సౌకర్యం కల్పిస్తామని చెప్పిన చంద్రబాబు అధ్యయనం పేరుతో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. పల్లె దీవెన, రైతు బంధు పథకాలు అమలు చేస్తామని హామీలు ఇచ్చి ఆరు నెలలు గడిచినా అమలు చేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు. పోరుబాటలో భాగంగా 2 నుంచి 10వ తేదీ వరకు పేద వారికి ఇంటి స్థలాలు, సొంత స్థలాలు ఉన్న వారికి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టనున్నామన్నారు.

ధరలను అదుపు చేయలేని బీజేపీ..

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ధరలను అదుపు చేయడం లేదని రామకృష్ణ ఆరోపించారు. బీజేపీ నేతలు మతాన్ని అడ్డుపెట్టుకొని అధికారాన్ని చేజిక్కించుకుని పబ్బం గడుపుకుంటున్నారన్నారు. రైతుల కష్టాలు తీర్చడం లేదని, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించడం లేదన్నారు. పార్లమెంట్‌లో భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్‌ను అవమానపరిచారన్నారు. వీరికి రాజ్యాంగం పట్ల నమ్మకం కూడా లేదన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూడా అంబేడ్కర్‌ను అవమానించిన ఘటనలో ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే రామాంజనేయులు, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ లెనిన్‌బాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు కే జగన్నాథం, సహాయ కార్యదర్శి ఎస్. మునెప్ప పాల్గొన్నారు.

నేరాలు.. ఘోరాలు

- 2024లో 46 హత్య కేసులు
- దళితులకు తప్పని అవమానాలు
- దొంగల చేతివాటమూ అధికమే!
- సైబర్ నేరాల్లో రికవరీ సున్నా..



2024 వార్షిక నేరాల నమోదు వివరాలను వివరిస్తున్న ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా

జిల్లాలో నమోదైన నేరాల వివరాలు

2023	నేరం	2024
34	హత్యలు	46
0	దోపిడీలు	6
312	దొంగతనాలు	346
129	ఎస్సీ, ఎస్టీ కేసులు	135
29	సైబర్ నేరాలు	56
3	అత్యాచారాలు	3
601	అక్రమ మద్యం కేసులు	1457

బొమ్మలసత్రం: నంద్యాల జిల్లాలో నేరాలు ఘోరాలు 2024లో అధికంగా నమోదయ్యాయి. జిల్లాగా ఏర్పాటైనప్పుడున్న జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి 2024 జులైలో బదిలీ కాగా అధిరాజ్‌సింగ్‌రాణా అదేనెల 15న ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. మంగళవారం నాటితో 2024 సంవత్సరం ముగియనుండటంతో పోలీస్‌శాఖ జిల్లా వార్షిక నివేదికను విడుదల చేసింది. 2023తో పోలిస్తే 2024లో హత్యలు, సైబర్ నేరాలు, దొంగతనాలు ఎక్కువగానే జరిగాయి. నాటుసారా, అక్రమ మద్యం తరలింపు కేసులు కూడా అధికంగానే నమోదయ్యాయి.

హత్యలు..

జిల్లాలో 2024లో 46 హత్యలు జరిగాయి. అలాగే 6 దోపిడీ, 346 చోరీలు నమోదయ్యాయి. 28 హత్యాయత్నం కేసులతోపాటు మట్కా, గంజాయి కేసులు కూడా ఎక్కువగానే నమోదయ్యాయి.

సైబర్ కేటుగాళ్లదే పైచేయి

2024లో సైబర్ నేరగాళ్లు విచ్చలవిడిగా దోచుకున్నారు. జిల్లా కేంద్రంలో ఒక డాక్టర్‌ను డిజిటల్ అరెస్ట్ పేరుతో బురిడీ కొట్టించి ఏకంగా రూ.38 లక్షలు కాజేశారు. నకిలీ సంస్థల పేరుతో బిట్ కాయిన్స్ విక్రయించి ఒకరి నుంచి రూ.1కోటిగా పైగా కేటుగాళ్లు సొమ్ముచేసుకున్నారు. ఒక ఉపాధ్యాయుడు ఈఏడాది నకిలీ సంస్థను నమ్మి పెట్టుబడి పెట్టి రూ.8 లక్షలకు పైగా మోసపోయి చివరికి ఆత్మహత్యకు పాల్పడటం విచారకరం. జిల్లా వ్యాప్తంగా మొత్త 56 సైబర్ కేసులు నమోదయ్యాయి. కాగా రూపాయి కూడా రికవరీ కాలేదు.

మట్కా భూతం

జిల్లాలో 2024లో మట్కా బాబులు వారి వ్యాపారాన్ని మరింత విస్తరింపజేశారు. 73 మట్కా కేసులకు గాను రూ.1,96,0052 నగను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈసంఖ్యను చూస్తే మట్కా జిల్లా వ్యాప్తంగా కోరలు చాచుస్తుందో ఇట్టే అర్థమవుతుంది.

రక్తమోడినహదారులు

2024లో అతివేగం, మద్యం తాగి, నింధనలకు విరుద్ధంగా వాహనాలను నడపటం వల్ల 633 ప్రమాదాలు సంభవించాయి. వాటిలో తీవ్రమైన ప్రమాదాలు 61 నమోదయ్యాయి. 2023తో పోలీస్తే ప్రమాదాల సంఖ్య కాస్త తగ్గింది. బ్లాక్‌స్పాట్‌ల గుర్తింపు, ప్రమాదాల సూచికల ఏర్పాటు తదితర చర్యల వల్ల ప్రమాదాల సంఖ్య పెరగకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు.

డిగ్రీ ఫలితాలు విడుదల

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో మే/జూన్ నెలల్లో జరిగిన డిగ్రీ 2, 4వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను విడుదల చేశారు. వర్సిటీ ఇన్‌చార్జ్ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎన్ టీకే నాయక్ ఆదేశాల మేరకు ఫలితాలను విడుదల చేసినట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. రెండో సెమిస్టర్ పరీక్షలకు 6,376 మంది హాజరు కాగా 2,752 మంది, నాల్గవ సెమిస్టర్‌కు 5,735 మందికి 3,133 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు పేర్కొన్నారు. ఫలితాలు htt pr://rayaaree mauniverrity.ac.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రీ వాల్యుయేషన్ చేయంచాలనుకునే వారు ఈనెల 10వ తేదీలోగా సంబంధిత కళాశాలల ప్రిన్సిపాళ్ల వద్ద దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జర్నలిస్టుల అక్రిడేషన్ గడువు పొడిగింపు

నంద్యాల: వర్కింగ్ జర్నలిస్టుల అక్రిడేషన్‌ల గడువును జనవరి 1 నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు (2 నెలలు) రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు ఉత్తర్వులు జారీ చేశారని జిల్లా కలెక్టర్, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ రాజకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

5న కురువ వివాహ పరిచయ వేదిక

కర్నూలు(అర్బన్): స్థానిక జిల్లా పరిషత్ ప్రాంగణంలోని మండల పరిషత్ సమావేశ భవనంలో ఈ నెల 5వ తేదీ ఉదయం 10 గంటలకు కురువ, కురుబ, కురుమ కులస్థుల వివాహ పరిచయ వేదిక కార్యక్రమాన్ని నిర్వ హిస్తున్నట్లు జిల్లా కురువ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పత్తికొండ శ్రీనివాసులు, ఎంకే రంగస్వామి తెలిపారు. ఈ వేదికకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం స్థానిక కార్యాలయ ఆవరణలో విడుదల చేశా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని కురువ సామాజిక వర్గానికి చెందిన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తమ అవివాహిత పిల్లలకు వివాహాలు చేసేందుకు ఈ వేదిక ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అసోసియేట్ అధ్యక్షులు గుడిసె శివన్న, మహిళా విభా గం అధ్యక్ష, కార్యదర్శులు టీ శ్రీలీల, కే అనితాలక్ష్మి, తేజస్వి ని, నాయకులు కేసీ నాగన్న, బీ వెంకటేశ్వర్లు, కే ధనుంజయ, బీ రామక్రిష్ణ, తవుడు శ్రీనివాసులు, పాల సుంకన్న, బీసీ తిరుపాలు, పుల్లన్న, దివాకర్ పాల్గొన్నారు.

అమరావతిని ఫ్రీజోన్‌గా ప్రకటించాలి



లోగోను ఆవిష్కరిస్తున్న ఎస్.లెనిన్‌బాబు

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర రాజ ధాని అమరావతిని ఫ్రీజోన్‌గా ప్రకటించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. లెనిన్‌బాబు డిమాండ్ చేశారు. మంగళవారం కర్నూలులోని సీఆర్ భవన్‌లో ఫిబ్రవరి 6 నుంచి 9వ తేదీ వరకు శ్రీకాకుళంలో జరిగే ఏఐవైఎఫ్ 22వ రాష్ట్ర మహాసభల లోగోను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ రాష్ట్రంలోని 26 జిల్లాల వారికి అమరావతి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధి కల్పనలో విఫలమైందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, చంద్రశేఖర్, నాగరాజు, బీసన్న పాల్గొన్నారు.

గణితం ప్రకారం ఆకర్షణీయమైన సంఖ్య 2025

కర్నూలు కల్చరల్: గణితం ప్రకారం 2025కు ప్రత్యేకత ఉందని ఇది ఆకర్షణీయమైన సంఖ్య అని ప్రముఖ గణిత ఉపాధ్యాయులు డి.ఈశ్వరయ్య పేర్కొన్నారు. $45\times45=2025$ ఒక వర్గ సంఖ్య, రెండు వర్గ సంఖ్యల లబ్ధంగా కూడా దీన్ని రాయవచ్చన్నారు. మూడు సంఖ్యల వర్గంగా రాయగలిగిన ప్రత్యేక సంఖ్య కూడా అవుతుందన్నారు. 1936 (44×44) తర్వాత వచ్చిన వర్గ సంఖ్య 2025 అన్నారు. 2025 (45×45)తరువాత మళ్లీ ఇలాంటి వర్గ సంఖ్య 2116లో (46×46) వస్తుందన్నారు. 2025ను మొదట 9 అంకెల ఘనాల $(1\times3, 2\times3, 3\times3, 4\times3, 5\times3, 6\times3, 7\times3, 8\times3, 9\times3)$ మొత్తంగా రాయవచ్చన్నారు.

మహిళ ఆత్మహత్య

సంజామల: మండల పరిధిలోని ఆల్వకొండ గ్రామానికి చెందిన ఓ మహిళ మంగళవారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్ఐ రమణయ్య తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన పెద్ద నరసింహుడు భార్య అబిగళ్ల గౌరమ్మ(50) అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. ఈక్రమంలో జీవితంపై విరక్తితో పురుగు మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు కూమర్తెలు, కుమారుడు ఉన్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా పెద్దమ్మ జాతర

రుద్రవరం: మండల పరిధిలోని ఆర్.నాగులవరంలో మంగళవారం పెద్దమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. ఇటీవల అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ గావించారు. 41 రోజులకు జాతరను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. సర్పంచ్ గంధం సావిత్రమ్మ, ఆళ్లగడ్డ మార్కెట్ యార్డు కమిటీ మాజీ చైర్మెన్ గంధం రాఘవరెడ్డి కుటుంబ సభ్యులు, ఉప సర్పంచ్ నరసింహా, గ్రామస్తులతో కలిసి పూజ సామగ్రితో మేళతాళాల నడుమ ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

అడిషనల్ ఎస్పీకి వినతి

నంద్యాల(వ్యవసాయం): విజయవాడలో హైందవ శంఖారావానికి వెళ్లే వాహనాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని హైందవ శంఖారావం సభ్యులు రాంప్రసాద్, శేషసాయి మంగళవారం అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు, డీఎఫ్ఓ అనురాగ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. సురేష్‌రెడ్డి, ప్రసాద్ ఉన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి

నంద్యాల(అర్బన్): నంద్యాలలోని సహకార వ్యవసాయ పరపతి సంఘాల్లోని ఖాతాదారులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని పోలూరు సహకార సంఘం సీఈఓ వీరభద్రుడు తెలిపారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. సున్నావడ్డీ రుణాలు, ప్రభుత్వ పథకాలు, రాయితీలు పొందాలంటే ఖాతాదారులు స్థానికంగా ఉండే సచివాలయాల్లో ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఖాతాదారులకు సహకార సంఘం ఎన్నికల్లో ఓటు హక్కు ఉంటుందని, ఈకేవైసీ చేయించుకోకపోతే ఓటు హక్కు కోల్పోయే అవకాశం ఉంటుందని తెలిపారు. ఆయన వెంట సొసైటీ అధికారి హుసేన్‌బాషా ఉన్నారు.

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని పలు చర్చిల్లో అర్ధరాత్రి నుంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నట్లు హోలీక్రాస్ కెథడ్రల్ పాస్టరేట్-1(పెద్దచర్చి) డీనరీ చైర్మన్ జోసెఫ్, పాస్టరేట్-2 ఆల్‌సెయింట్ చర్చి డీనరీ చైర్మన్ ఇమ్మానియేల్ మంగళవారం తెలిపారు. ప్రార్థనలు అనంతరం కేక్ కటింగ్, నూతన సంవత్సర వేడుకలు ఉంటాయన్నారు.

హరినామస్మరణం.. సర్వపాపహరణం

నంద్యాల(వ్యవసాయం): హరినామస్మరణం వల్ల సర్వపాపాలు తొలగిపోతాయని తిరుమల తిరుపతి దేవస్థానం వ్యాఖ్యాత డాక్టర్ దీవీ హయగ్రీవాచార్యులు పేర్కొన్నారు. మంగళవారం సంజీవనగర్ రామాలయంలో శ్రీభగవత్ సేవా సమాజ్ తిరుమల తిరుపతి దేవస్థానం ఆల్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో 16వ రోజు తిరుప్పావై ప్రవచనాలను భక్తులకు వినిపించారు. శ్రీకృష్ణుడిని సేవించడం వల్ల ఓర్పు, నేర్పు వంటి సద్గుణాలు అలవడుతాయని, అదే విధంగా స్వామివారి కటాక్షం లభిస్తుందన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

శిరివెళ్ల: ఏపీయూఎస్ నూతన సంవత్సర క్యాలెండర్లను మంగళవారం ఎంఈఓ శంకరప్రసాద్ ఆవిష్కరించారు. సంఘం మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, కార్యదర్శి వెంకటేశ్వర్లు, సభ్యులు పాల్గొన్నారు.



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ

మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీల తొలగింపు

శిరివెళ్ల: యర్రగుంట్ల మేజర్ గ్రామ పంచాయతీలోని పాఠశాలల మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీలను తొలగించినట్లు ఎంఈఓ శంకరప్రసాదు మంగళవారం తెలిపారు. జెడ్పీ ఉన్నత పాఠశాల, మెయిన్, స్పెషల్ ప్రాథమిక పాఠశాలలు, ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలల ఏజెన్సీలను తొలగించామన్నారు. వారి స్థానంలో కొత్త ఏజెన్సీలు జనవరి నుంచి భోజన పథంకం అమలు చేస్తాయని తెలిపారు.

గ్రీటింగ్స్‌లో కొత్త ట్రెండ్

- కనిపించని గ్రీటింగ్‌కార్డుల విధానం
- డిజిటల్ విషెస్‌తో కొత్త సంవత్సరానికి స్వాగతం

గోస్పాడు: గతంలో నూతన సంవత్సర వేడుకలంటే కొత్త దుస్తులు, గ్రీటింగ్ కార్డుల కొనుగోలుకు ప్రజలు ప్రాధాన్యం ఇచ్చేవారు. న్యూ ఇయర్, పండుగలకు శుభాకాంక్షలు తెలిపే వారధిగా గ్రీటింగ్ కార్డులకు ప్రత్యేక స్థానం ఉండేది. అప్పట్లో ప్రతి ఒక్కరూ తమ స్థాయి మేరకు కార్డులను కొనుగోలు చేసి బంధు మిత్రులకు నేరుగా లేదా పోస్ట్ ద్వారా అందజేసి ఆత్మీయతను చాటుకునేవారు. ప్రత్యేకంగా ప్రేమికుల గ్రీటింగ్ కార్డులకు స్పెషల్ క్రేజ్ ఉండేది. అయితే మారుతున్న ఆధునిక యుగంలో సాంకేతిక పరిజ్ఞానం విస్తృతం కావడంతో గ్రీటింగ్ కార్డులు కాలగర్భంలో కలిసిపోయాయి. గతంలో నూతన ఏడాది వస్తోందంటే పోస్టల్ సిబ్బంది న్యూఇయర్ గ్రీటింగ్ కార్డులు, ఉత్తరాలతో బిజీబిజీగా ఉండేవారు. 15 రోజుల ముందు నుంచే పోస్టు ద్వారా శుభాకాంక్షలు తెలిపేందుకు పంపే కార్డులతో పోస్టుబాక్సులు నిండి పోయేవి. స్మార్ట్‌ఫోన్ల రాకతో గ్రీటింగ్ కార్డులు కనుమరుగయ్యాయి.



మార్కెట్లో ప్రత్యేక ఆకర్షణగా ఉన్న కేకులు

కళతప్పిన దుకాణాలు

ఒకప్పుడు నూతన ఏడాది సమీపిస్తుంటే గ్రీటింగ్ కార్డుల దుకాణాలు కళకళలాడేవి. ప్రత్యేకంగా రూపొందించిన ఆకారాల్లో, ఆకర్షణీయంగా ఉండే మెసేజ్‌లతో కార్డులు అందుబాటులో ఉండేవి. కవితలతో పాటు, మ్యూజిక్ కార్డులను ప్రత్యేకంగా ముద్రించి యువతను ఆకట్టుకునేలా తయారు చేసేవారు. విజిటింగ్ కార్డు సైజ్ నుంచి పోస్టుకార్డు, ఏ4 పేపరు సైజ్ వరకు గ్రీటింగ్ కార్డులు విక్రయించేవారు. రూపాయి నుంచి రూ. వేల విలువైన కార్డులు మార్కెట్లో హల్‌చల్ చేసేవి.

ఇప్పుడంతా కేకులే..

డిసెంబర్ 31వ తేదీ రాత్రి 12 గంటలు కాగానే చాలా మంది కేక్ కట్ చేసి కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతున్నారు. ఇక యువత కేక్ కట్ చేయడమే కాక స్నేహితులు ఒకరి ముఖాలకు మరొకరు పూసుకుని న్యూ ఇయర్‌కు వెల్‌కమ్ చెప్పడం ట్రెండ్‌గా మారింది. వ్యాపారులు పెద్ద ఎత్తున కేక్‌లను అందుబాటులో ఉంచుతున్నారు. ప్రతి ఒక్కరు చిన్నపాటి కేకును అయినా కట్ చేసి న్యూ ఇయరుకు వెల్‌కమ్ చెప్పేందుకు ఇష్టపడుతున్నారు. న్యూఇయర్ సందర్భంగా కేక్‌కు ఉన్న డిమాండ్ కారణంగా ఈ ఏడాది గత ఏడాది కంటే ఎక్కువ స్థాయిలో తయారు చేయిస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. వివిధ ఆకృతుల్లో ప్రత్యేకంగా తయారు చేయించుకుంటున్నారు.

కొత్త ఆశలతో..

నంద్యాల(వ్యవసాయం): కొత్త ఆశలతో.. కొండంత ఆత్మవిశ్వాసంతో నూతన సంవత్సరంలోకి అడుగు పెడుతున్న శుభ సమయం ఇది. గత ఏడాది మిగిల్చిన చేదు జ్ఞాపకాలను వదిలేసి, తీపి జ్ఞాపకాలతో వేడుకలను జరుపుకోవడానికి ప్రజలు, అధికారులు, రాజకీయ నాయకులు ఏర్పాట్లు చేసుకున్నారు. కొత్త సంవత్సరం రోజున రాజకీయ నేతలు, ప్రభుత్వ శాఖల అధికారులను సిబ్బంది, పార్టీ నేతలు కలుసుకుని శుభాకాంక్షలు తెలియజేయడం ఆనవాయితీ. ఈ క్రమంలో భారీ ఎత్తున కేక్‌లు అమ్మకాలు జరిగాయి. ప్రధాన రోడ్లలో బేకరీల యాజమాన్యాలు ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేసి కేక్‌లను విక్రయించారు. అరకేజీ కేకు రూ.150, కేజీ కేకు రూ.350చొప్పున అమ్ముతున్నారు. మిఠాయిలను భారీ ఎత్తున అందుబాటులోకి తెచ్చారు. బొకేలు, పూల దండలు రూ.100 నుంచి రూ.వెయ్యి వరకు, సిద్ధం చేశారు. అలాగే హోటళ్లు, రెస్టారెంట్లు ప్రత్యేకమైన ఆఫర్లు ఇస్తున్నారు.





అమ్మకానికి సిద్ధంగా ఉంచిన బొకేలు, మిఠాయిలు

న్యాయవాదుల ఆందోళన



నంద్యాల టూటౌన్ స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న న్యాయవాదులు

నంద్యాల(వ్యవసాయం): రాష్ట్రంలోని అనంతపురం, వైఎస్సార్ జిల్లాల్లో న్యాయవాదులపై పోలీసుల అప్రజాస్వామ్య చర్యలను నిరసిస్తూ జిల్లా బార్ అసోసియేషన్ పిలుపు మేరకు మంగళవారం నంద్యాల టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట న్యాయవాదులు ధర్నా చేశారు. మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. దీంతో గంటకు పైగా ట్రాఫిక్ స్తంభించింది. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, సీనియర్ న్యాయవాదులు కానాల విజయశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి పెద్ది శ్రీనివాసులు, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు రామసుబ్బయ్య, ముక్కెర కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. అనంతపురం త్రీటౌన్ పోలీసులు సివిల్ వ్యవహారంలో కలగజేసుకుని సీనియర్ న్యాయవాది బీవీ శేషాద్రితో అనుచితంగా ప్రవర్తించి బెదిరించారన్నారు. ఆందోళనకు గురైన శేషాద్రి గుండెపోటుతో పోలీస్‌స్టేషన్‌లోనే ప్రాణాలు కోల్పోయారన్నారు. మృతికి కారణకులైన వారిని సస్పెండ్ చేసి వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాదుల రక్షణకు చట్టం తీసుకురావాలని కోరారు. అలాగే రాయచోటిలో న్యాయవాదిపై అమానుషంగా ప్రవర్తించిన సీఐ కొండారెడ్డిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులు వివేకానందరెడ్డి, శ్రీనివాసరెడ్డి, భూమన వెంకటేశ్వర్లు, ఓబులరెడ్డి, బోయసుబ్బరాయుడు, తిమ్మారెడ్డి, సుబ్బరాయుడు, పాల్గొన్నారు.

డ్రాగన్ బోట్ పోటీలకు ప్రభుత్వ విద్యార్థులు

నంద్యాల(న్యూటౌన్): జాతీయ స్థాయి డ్రాగన్ బోట్ పోటీలకు నంద్యాల ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు ఆనంద్, అరుణ్‌కుమార్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శశికళ తెలిపారు. రాష్ట్రస్థాయి డ్రాగన్ బోట్ పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించినట్లు పేర్కొన్నారు. దీంతో జనవరి 3 నుంచి 6వ తేదీ వరకు ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి డ్రాగన్ బోట్ పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను అభినందించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాసులు, జిల్లా డ్రాగన్ బోట్ ప్రెసిడెంట్ మహమ్మరఫీ, సెక్రటరీ అపర్ణ పాల్గొన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

పంట మార్పిడితో అధిక దిగుబడులు

రుద్రవరం: పంట మార్పిడి చేయడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని ఆళ్లగడ్డ సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడు రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పెద్దకంబలూరులో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పరిధిలో రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించారు. పంట మార్పిడితో పాటు భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడటం వల్ల పెట్టుబడులు తగ్గుతాయని తెలిపారు. ఎకరాకు 4 నుంచి 10 టన్నుల పశువుల ఎరువు పొలాలకు వాడటం ద్వారా సూక్ష్మ పోషకాలు అందుబాటులోకి వచ్చి అధిక దిగుబడులు వస్తాయని పేర్కొన్నారు. ఏఓ నాగేంద్ర ప్రసాద్, ఏఈఓలు రాజు, ఫహిమ, తబస్సుం ఉన్నారు.

రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయ సహాయ సంచాలకులు →



ఏపీటీఎఫ్ క్యాలెండర్లు విడుదల

నంద్యాల(న్యూటౌన్): ఆంధ్ర ప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ నూతన సంవత్సర క్యాలెండర్, డెయిరీని జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ..డైరీలో పొందుపరిచిన అంశాలు ఉపాధ్యాయులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. జీవోలన్నింటిని పుస్తక రూపంలో ముద్రించడం చాలా సంతోషమన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి శివయ్య, రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ భాస్కరరెడ్డి, సబ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



డైరీని ఆవిష్కరిస్తున్న డీఈఓ

ప్రజా సమస్యల పరిష్కారానికే సదస్సులు

ఉయ్యాలవాద: రైతులు, ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం మండలంలోని ఇంజేడు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కేవలం భూ సమస్యలే కాకుండా గ్రామంలో ఏదైనా రస్తాలు, స్థల సమస్యలు ఉంటే గ్రామసభలో అర్జీలు అందజేయాలని సూచించారు. అంతకు ముందు గ్రామంలోని ఎస్సీ కాలనీలో అధికారులు పర్యటించారు.

సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో 998 మంది రైతులకు చెందిన 3,300 ఎకరాలను రీసర్వే చేసినట్లు తెలిపారు. వీటిలో లోపాలను సరి చేయాలని రైతులు తహసీల్దార్‌కు విన్నవించారు.